క్లుప్తంగా

గోదాదేవి, శ్రీ కృష్ణుని వేషధారణ పోటీలు

విజయవాడ కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా గోదాదేవి శ్రీ కృష్ణుని వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సెకన్ల నిడివిగల వీడియోలను 94402 63055కు ఈ నెల 16వ తేదీ లోపల పంపాలని కోరారు. విజేతల వివరాలను తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

యూజీడీ పైపులైన్లకు మరమ్మతులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58, 59, 60 డివిజన్లలో తలెత్తిన డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తెలిపారు. సింగ్‌నగర్, వాంబేకాలనీ ప్రాంతాల్లో మూడు రోజుల నుంచి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్య నెలకొంది. ఆమె సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య తలెత్తడానికి కారణాలు తెలుసుకున్నారు. వాంబేకాలనీ రోడ్డులోని ప్రధాన డ్రెయినేజీ సంపు పైపులైన్లు పగిలిపోవడంతో డ్రెయినేజీ సమస్య ఏర్పడినట్లు తెలుసుకున్నారు. ఆమె వెంటనే వాటి మరమ్మతు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆ పనులను దగ్గరుండి పరిశీలించిన ఆమె సోమవారం లోపు ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

రేపు జాబ్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం శారదా కళాశాలలో ఈ నెల 10వ తేదీన మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నాగేశ్వరశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మేళాలో 17 ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలలో 966కు పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తారరి తెలిపారు. ఉమ్మడి, కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాలోని ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీ, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 89190 00209, 96761 65850లో సంప్రదించాలని ఆయన కోరారు.

పండగలతో బంధాలు పటిష్టం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పండగలతో బంధాలు పటిష్టం అవుతాయని ప్రజలు కలిసి మెలసి పండగలను జరుపుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. స్థానిక దుర్గాపురంలో భగవత్‌శక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆమె విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బీ గాంధీ, కే రాము, బీ ఆదర్శ్ పాల్గొన్నారు.

తూనికలు, కొలతల అధికారుల దాడి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో తూనికలు, కొలతల అధికారులు మాంసం దుకాణాలపై ఆదివారం ఆకస్మికంగా దాడి చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని మటన్, చికెన్ దుకాణాల్లో కటాలు, రాళ్ల పరిమాణాన్ని తనిఖీ చేశారు. కొండపల్లిలో అనేక దుకాణాలు తనిఖీ చేశామన్నారు. ఎక్కడా కొలతలు, కాటా రాళ్లలో తేడా కనిపించలేదని తెలిపారు. తేడా ఉన్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు.

ఇండియన్ స్ప్రింగ్స్‌లో రంగవల్లుల పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో సంక్రాంతి పండగ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 120 మంది మహిళలు వివిధ రకాల ముగ్గులు తీర్చిదిద్దారు. విద్యార్థుల కోలాహలం మధ్య గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు వేశారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీస్సులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన ముగ్గురు మహిళలకు బహుమతులు అందజేశారు. పాఠశాల జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య, ప్రిన్సిపాల్ వాణీకుమారి, వైస్ ప్రిన్సిపాల్ నాగరత్నం పాల్గొన్నారు.

నేడు పూలే విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం: మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎన్టీటీపీఎస్ పాతగేటు వద్ద సోమవారం జరుగుతుందని ఆసంఘం బ్రాంచి అధ్యక్షుడు సీహెచ్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని విగ్రహం ఆవిష్కరిస్తారు. అనంతరం యూనియన్ రాష్ట్ర మహాసభ జరుగుతుంది.

పేదల వైద్యానికి స్వచ్ఛంద సంస్థల సేవలు ఎనలేనివి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కృత్రిమ కాళ్లను అందిస్తున్న నిర్వాహకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదలకు వైద్య సేవాలందించాలనే సంకల్పంతో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు ఎనలేనివని ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నవయుగ వైద్య, ఆరోగ్య సేవా సంస్థ, వల్లూరిపల్లి కేశవరావు, నవరత్నం ఫౌండేషన్ వారి వరుణ్ హెల్త్ సెంటర్, ప్రతిస్పందన స్వచ్ఛంద సేవా సంస్థ, శ్రీరామకృష్ణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో ఆదివారం కృత్రిమ అవయవాలు పంపిణీ, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలను అందించడంతో పాటుగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూడా పేదలను ఆదుకుంటున్నామన్నారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఇలా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేయడంతో పాటు కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, ఎండీ షాహీనా సుల్తానా, నిర్వాహకులు డాక్టర్ వెంకట్రావ్, కోలా శాంతకుమారి, సునీల్ పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామి ఆలయ ద్వారబంధానికి పూజలు



ద్వారబంధానికి పూజలు చేస్తున్న ఆలయ ఈఓ భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయానికి ద్వారబంధం ఏర్పాటుకు ఆదివారం ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులలో భాగంగా ఆలయానికి ద్వారాల ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఆదివారం ఆలయ ఈఓ భ్రమరాంబ గ్రానైట్‌తో రూపొందించిన ద్వారబంధానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు, ఏఈఓ ఎన్.రమేష్ బాబు, బీ వెంకటరెడ్డి, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాథుని ఆశీస్సులు ప్రతిఒక్కరికీ అందాలి



ధనుర్మాస పూజల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గోదా రంగనాథస్వామి ఆశీస్సులు ప్రతిఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే, ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లో ధనుర్మాసోత్సవ పూజలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామికి ప్రీతికరమైన ధనుర్మాసంలో ప్రజలందరూ కలిసి పూజలు చేయడంతో పాటు పారాయణం చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం స్వామి ఊరేగింపు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముస్లిం మైనార్టీల హక్కుల సాధనకు కృషి

ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా



సల్మాకు నియామకపత్రాన్ని అందిస్తున్న నాగుల్‌మీరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం ఆజాద్ ముస్లిం కమిటీ నిరంతరం పాటుపడుతుందని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎంసీ సభ్యులందరూ తమ పరిధిలో ఉన్న ముస్లిం మైనార్టీలంతా ఈ పథకాలు వినియోగించుకునేలా చూడాలన్నారు. మైనార్టీల హక్కుల సాధన కోసం ఏఎంసీ నిరంతరం శ్రమిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ముస్లిం మైనార్టీలకు సముచితస్థానం లభిస్తుందన్నారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన షేక్ సల్మాను ఆజాద్ ముస్లీం కమిటీ సెంట్రల్ నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ తీర్మానించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిసి ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. ఏఎంసీ నాయకులు సయ్యద్ మౌలాలి, షేక్ సాజిద్ అలీ, హుస్సేన్, హఖ్, మస్తాన్, ఇర్ఫాన్‌పాషా, బిలాల్ పాల్గొన్నారు.

పండగల గొప్పతనం వివరించాలి



విచిత్రవేషధారణలో పాల్గొన్న చిన్నారులు, నిర్వాహకులు



గొబ్బెమ్మలకు పూజలు చేస్తున్న బాలికలు

విజయవాడ కల్చరల్: భావి తరాలకు పండగల గొప్పతనం వివరించాల్సిన అవసముందని రాష్ట్ర సేవికా సమితి ప్రాంతీయ సంచాలిక డాక్టర్ డీ సోమేశ్వరి అన్నారు. భారత సేవా సమితి ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని శిశు విద్యామందర్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తెలుగు వారు జరుపుకునే పండగలు ఆధ్యాత్మికతోపాటు, తెలుగు వారి జీవిన విధానం నిండివుంటుందన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంతకార్యకారిణి సభ్యుడు రాజేంద్ర మాట్లాడుతూ స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయనలోని సేవా భావం, భక్తి తత్వం, ఇతరులకు సహాయపడే మనసు కలిగివుండాలన్నారు. చికాగోని సర్వమత సమ్మేళనం ఆయన ప్రసంగం ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో నిలచిపోయిందన్నారు. పారిశ్రామిక వేత్త కొత్తమాసు గోపాలరావు, పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీముఖి అనుమాలు ప్రసంగించారు. వివిధ పాఠశాలలనుంచి వచ్చిన బాల బాలికలు, భారతీయ పురాణపురుషులు, చారిత్రక పురుషులు, శ్రీకృష్ణుడు, గోపికలు, విచిత్రవేషాలతో అలరించారు. పాల్గొన్న వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ధాన్యం బస్తాల మాయంపై కేసు

కంచికచర్ల: గుర్తు తెలియని వ్యక్తులు కళ్లాల్లోని ధాన్యం బస్తాలను దొంగిలించడంతో రైతు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శౌరి అమరవరం గ్రామానికి చెందిన రైతు సుబ్బారావు తన పొలంలో పండించిన ధాన్యాన్ని డిసెంబర్ 27వ తేదీన కళ్లంలో ఆరబెట్టి బస్తాల్లో నింపాడు. రాత్రి పొద్దుపోవడంతో తెల్లవారుజామున ఇంటికి తరలిస్తాననుకుని కళ్లంలోనే 24 బస్తాలను వదలి ఇంటికి వెళ్లాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఆ ధాన్యపు బస్తాలను అపహరించుకుపోయారు. చుట్టుపక్కల వెదికినా ఎటువంటి సమాచారం అందలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చదువుతోనే వ్యక్తిత్వ వికాసం

పటమట(విజయవాడ తూర్పు): విద్యార్థి వ్యక్తిత్వం స్కూల్లోనే రూపుదిద్దుకుంటుందని నగర ప్రముఖులు కె.ఎస్.చలపతిరావు అన్నారు. పటమట గురునానక్‌కాలనీలోని డాన్‌బాస్కో స్కూల్ 40వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చలపతిరావు మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్నే మార్చేస్తుందన్నారు. చదువును ఎవరూ దొంగిలించలేరన్నారు. ఉపాధ్యాయులను గౌరవిస్తూ చదువులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. డాన్‌బాస్కో స్కూల్‌ను నేషనల్ ఇన్నోవేషన్ హబ్‌గా నీతిఆయోగ్ గుర్తించడం అభినందనీయమన్నారు. పాఠశాల సాధించిన అనేక అవార్డుల వెనుక ఉపాధ్యాయుల కృషి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ కృష్ణచంద్, డాక్టర్ రాకేష్, డాక్టర్ రామబ్రహ్మం, డాక్టర్ రామశేషయ్య పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఆలయ ప్రాంగణంలో సూర్యభగవానుడికి పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన వేదిక వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం అమ్మవారి సన్నిధిలో సూర్యోపాసన సేవ చేస్తున్నామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

శ్రీదేవి కరుమారి అమ్మన్‌కు పుష్పయాగం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పుష్యమాసం, పుష్యమి నక్షత్రం, శ్రీదేవి కరుమారి అమ్మన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో ఆదివారం మహా పుష్పయాగం జరిగింది. అమ్మవారికి వివిధ ఉత్తమ జాతి పుష్పాలను అభిషేకానికి వినియోగించారు. పుష్పయాగానికి వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య ప్రముఖులు కొండపల్లి మురళీకృష్ణ(బుజ్జి) విచ్చేశారు. తొలుత ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు పీఠాధిపతి కరుమారి దాసు, ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదాలను అలయ కమిటీ సభ్యులు అందజేశారు. అమ్మవారికి, ఉత్సవ మూర్తులకు సుమారు ఐదు వందల కేజీల పుష్పాలను అభిషేకానికి వినియోగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాయప్రోలు దీక్షిత్, ఎస్.జ్ఞానేష్, వై.వెంకట నాగేందర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు





పటమట జెడ్పీ పాఠశాల్లో జరిగిన ముగ్గుల పోటీలు

పటమట(విజయవాడతూర్పు): సిటీ కేబుల్ వ్యవస్థాపకులు పొట్లూరి రామకృష్ణ జయంతి ఉత్సవాల్లో భాగంగా సిటీ కేబుల్, లియో, శ్రీ చక్ర, జీ తెలుగు, జీ సినిమా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పటమటలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పటమటలోని కేబీసీ జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీకేబుల్ ఎండీ పొట్లూరి సాయిబాబు మాట్లాడుతూ సిటీ కేబుల్ వ్యవస్థాపకులు స్వర్గీయ పొట్లూరి రామకృష్ణ 59వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. సంక్రాంతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జనవరి 28వ తేదీన పొట్లూరి రామకృష్ణ జయంతి కార్యక్రమాల్లో అందజేస్తామన్నారు. సాయి ప్రాపర్టీస్ అండ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అధినేత సీహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సిటీకేబుల్ వారితో కలిసి రెండో సంవత్సరం ఈ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ తరపున ముగ్గురు విజేతలకు, 10 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నాన్నారు. ఈ పోటీల్లో మచిలీపట్టణానికి చెందిన భవాని మొదటి బహుమతిని, నందిగామకు చెందిన జి దీపికా ద్వితీయ బహుమతిని, గుంటూరుకు చెందిన మణి మంజరి తృతీయ బహుమతిని సాధించారు. కార్యక్రమంలో నక్షత్ర ఎక్స్‌క్లూసివ్ నైట్ వేర్, రెడీ మేడ్ డ్రెస్సెస్ అధినేత బాజీ పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ముగిసిన కోవే–సిడ్బీ స్వావలంబన్ మేళా



స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి సర్టిఫికెట్స్ అందిస్తున్న సిడ్బీ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సిడ్బీ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. బెంజిసర్కిల్‌లోని వేదిక కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సిడ్బీ–కోవే స్వావలంబన్ మేళా ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరామచంద్రమూర్తి మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేసిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకునేందుకు సిడ్బీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కోవే(కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన స్వావలంబన్ మేళాకు మంచి స్పందన లభించిందన్నారు. కోవే రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక మాట్లాడుతూ కోవే–సిడ్బీ సంయుక్తంగా రానున్న రోజుల్లో మరింత పెద్ద స్థాయిలో ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా మహిళలు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేవిధంగా చిన్న వ్యాపార సంస్థల ద్వారా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశం కల్పించడమే కోవే ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ ప్రదర్శనలో 60 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ప్రతిస్టాల్ నిర్వాహకులకు సర్టిఫికెట్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోవే జాతీయ జాయింట్ సెక్రటరీ అపర్ణ, ఏపీ శాఖ కార్యదర్శి విజయలక్ష్మి, మోహిని, శ్రావణి, సత్యవతి పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడు



ప్రసంగిస్తున్న గరికపాటి గురజాడ

విజయవాడ కల్చరల్: భారతీయుల ప్రత్యక్షదైవం సూర్యభగవానుడని యువ ఆధ్యాత్మికవేత్త గరికపాటి గురజాడ పేర్కొన్నారు. శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించే సాహిత్యంలో సూర్యభగవానుడు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గరికపాటి గురజాడ మాట్లాడుతూ రామయణం, భారతం, అష్టాదశ పురాణాల్లో సూర్యుని ప్రస్తావన కనిపిస్తుందన్నారు. ప్రాచీన కవులు తమ కావ్యాలలో సూర్యోదయం. సూర్యాస్తమయం వర్ణన కనిపిస్తుందన్నారు. స్యూర్యధ్యానం వల్లనే పాండవులకు అక్షయ పాత్ర లభించిందని పేర్కొన్నారు. ఆదిత్య హృదయం పఠించడం వల్లనే రామాయణంలో శ్రీ రామచంద్రునికి విజయం లభించిందన్నారు. కవుల కవితా వస్తువు సూర్యభగవానుడుగా భావించవచ్చన్నారు. సూర్యుని ద్వారా ప్రసారమయ్యే కిరణాల ద్వారా కొన్ని రకాలైన దీర్ఘవ్యాధులు నయం అవుతాయని సైన్స్ చెబుతోందన్నారు. భారత దేశంలో అనేక సూర్యదేవాలయాలున్నాయన్నారు. సూర్యమానం అనుసరించి సంక్రాంతి పండగను తెలుగు వారు జరుపుకుంటారని తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ గరికపాటి గురజాడ విశేషాలను వివరించారు. గరిపాటి నరసింహారావు వారసుడిగా అనేక ఆధ్యాత్మిక ప్రసంగాలను చేసి, యువతను ధర్మమార్గం వైపు నడిపిస్తునట్లు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



ప్రతిభానికేతన్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వారంతా 1990 సంవత్సరంలో మాచవరంలోని ప్రతిభానికేతన్ స్కూల్లో పదో తరగతి సెక్షన్–ఏలో కలిసి చదువుకున్నారు. 32 సంవత్సరాల తర్వాత ఆదివారం విజయవాడ నగరంలోని పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులోని హోటల్లో సమావేశమయ్యారు. ఇక వారి సంతోషానికి హద్దులు లేవు. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరింపులు, ఆలింగనాలు, పరిచయాలు చేసుకున్నారు. విద్యార్థి దశలో చేసిన చిలిపి చేష్టలు, తరగతిలో చేసిన అల్లరిని ఒకసారి గుర్తు చేసుకున్నారు. ఒకరి సెల్‌ఫోన్ నంబర్లు ఒకరు పంచుకున్నారు. ఈ మధుర క్షణాలను సెల్‌ఫోన్ కెమెరాలో బంధించుకుని రోజంతా బాల్య స్నేహితులతో సరదాగా గడిపారు. వచ్చే ఏడాది మళ్లీ కలుద్దాం.. ఫ్రెండ్స్ అంటూ ఇంటి బాటపడ్డారు పూర్వ విద్యార్థులు. అమెరికా, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి ఆత్మీయ కలయికకు వచ్చిన వీరు ముందుగా స్కూల్ కరస్పాండెంట్ ఏబీకే ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తీగెల ఆంజనేయులు, గ్రంథాలయాధికారి పద్మావతి తదితరులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.











ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, మేరీ స్టెల్లా కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, పీవీ సిద్ధార్థ తదితర కళాశాలల్లో పరీక్షకు అభ్యర్థులు హాజరయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ